ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

శుక్రవారం 5 డిసెంబరు 2025

కేరళ ఉద్యోగులకు సెలవు ఇవ్వాలి

- స్థానిక ఎన్నికల్లో ఓటేసేందుకు అనుమతివ్వాలి
- డీసీఎం డీకే శివకుమార్‌కు వ్యాపార వర్గాల వినతి

7



అన్నీ కొరతే..!

- విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కరువు



- అధ్యాపకుల నుంచి గ్రాంట్లదాకా అరకొరే
- ఏళ్ల తరబడి భర్తీకాని పోస్టులు..ఉద్యోగులపై భారం
- చదువుకు దూరమవుతున్న గ్రామీణ విద్యార్థులు

బెంగళూరు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఉన్నత విద్యలో రాణిస్తున్న రాష్ట్రంగా కర్ణాటకకు పేరుంది. ప్రత్యేకించి ఉన్నత విద్యను పొందే విద్యార్థుల సంఖ్య రాష్ట్రంలో ఎక్కువని అందుకు జిల్లాలవారీగా ఉండే యూనివర్సిటీలే కారణమని చెప్పవచ్చు. కానీ ఇటీవల పలు లోపాలతో యూనివర్సిటీల ప్రతిష్ఠ దిగజారిపోతోంది. ఏటా విశ్వవిద్యాలయాల పరిస్థితి దారుణంగా మారుతోంది. అధ్యాపకులు, ఉద్యోగులకు నెలసరి వేతనాలకు తగిన నిధులు లేవు. పాఠ్యాంశాలు బోధించేందుకు అధ్యాపకులు లేరు. ఇలా ప్రధానమైన అంశాల పరిస్థితి దారుణంగా మారడంతో ఏటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతోంది. ఉన్నతవిద్య కోసం ఒక విద్యార్థి యూనివర్సిటీలో చేరితే అతడి ఆలోచనలు కేవలం పట్టా కోసం కాకుండా పరిశోధన కోసం అనేలా ఉండాలని పాలకులు చెబుతారు. కానీ యూనివర్సిటీల్లో నెలకొన్న సమస్యల పట్ల కనీసంగా కూడా దృష్టి సారించడం లేదు. ఏటా స్నాతకోత్సవాల వేళ జరిగే కార్యక్రమంలో గవర్నర్, ఉన్నత విద్యాశాఖ మంత్రి పాల్గొంటారు. ఆ తర్వాత ఉన్నత విద్యాశాఖ పనితీరును పర్యవేక్షించడంలో పూర్తిగా విఫలం చెందారనే ఆరోపణలు ఉన్నాయి. యూనివర్సిటీలు అంటే పరిశోధనా కేంద్రాలుగా ఉండాలి. అకడమిక్‌తోపాటు కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి. పీజీ ద్వారా మరింత పరిణితి చెందాలి. ఇక పీహెచ్‌డీ అంటే ఒక అంశంపై చేసే పరిశోధన భావితరాల విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలి. కానీ అధ్యాపకులు లేకుంటే ఇవన్నీ ఎలా సాధ్యమని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ (వీటీయూ), రాజీవ్‌గాంధీ వైద్య విశ్వవిద్యాలయం, మైసూరులోని రాష్ట్ర ఓపెన్ యూనివర్సిటీ మినహా మిగిలిన అన్ని యూనివర్సిటీల ఆర్థిక పరిస్థితి అధ్వానంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో వందేళ్లు పూర్తి చేసుకున్నాయనే పేరున్న మైసూరు యూనివర్సిటీ, కర్ణాటక యూనివర్సిటీ, బెంగళూరు యూనివర్సిటీలకు ఈ ఆర్థిక పరిస్థితిలో తేడా లేదనిపిస్తోంది.

నియామకాలపై దృష్టి పెట్టని ప్రభుత్వం

ఉన్నత విద్య సాకారం చేసే విశ్వవిద్యాలయాలలో 50శాతం మంది బోధనా సిబ్బంది, అంతకు ఏమాత్రం తక్కువ కాకుండా బోధనేతర సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఉన్నత విద్యాకు ఏటా కేటాయిస్తున్న బడ్జెట్ చాలకపోవడంతో విశ్వవిద్యాలయాల్లో చిన్నపాటి ఖర్చులకు వైస్ చాన్స్‌లర్‌లు, ఇతరులు కొట్టుమిట్టాడే పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు సుదూర ప్రాంతాలకు వెళ్లి ఉన్నత విద్యకోసం వెళ్లాలని జిల్లాలవారీగా అందుబాటులో ఉండేలా యూనివర్సిటీలను ప్రారంభించారు. ఇలా రాష్ట్రంలో 32 యూనివర్సిటీలు పనిచేస్తున్నాయి. ఇక్కడ యూనివర్సిటీలకు చరిత్ర ఉందిగానీ అన్నింటా మైనస్‌లే అనేలా మారిపోయింది.

- రాష్ట్రంలో వ్యవసాయ, ఇంజనీరింగ్, వైద్య విశ్వవిద్యాలయాలు మినహాయిస్తే మిగిలిన 30 యూనివర్సిటీలలోనూ అధ్యాపకుల కొరత వెంటాడుతోంది. మంజూరైన 4,325 అధ్యాపకుల పోస్టుల్లో 2,790 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాలన, నిర్వహణకు సంబంధించి 8,451 బోధనేతర ఉద్యోగాలు మంజూరైనవి కాగా 5,866 పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. దాదాపు అన్ని యూనివర్సిటీల్లోనూ ప్రారంభమైన సంవత్సరం నుంచే సిబ్బంది కొరత వెంటాడుతోంది. 2016లో ప్రకటించిన 8 యూనివర్సిటీలకు అధ్యాపకులను నియమించే ప్రక్రియ ఇప్పటివరకు జరగలేదు. ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో కలిపి 2,790 పోస్టులకు అతిథి రూపంలో ఏటా నియమించుకుంటున్నారు. ఖాళీగా ఉండే ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల స్థానంలో ప్రైవేటుగా నియమించుకుంటున్నారు. అందులో కొందరికి అర్హత లేకున్నా అనుభవం దృష్ట్యా కూడా అవకాశాలు కల్పించాల్సి వస్తోంది. ఇలా సమగ్రమైన అర్హత కల్గిన ప్రొఫెసర్లు లేనందున డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ చేసే విద్యార్థులపై తీవ్రమైన ప్రభావం ఉంటుంది. ఎటువంటి ర్యాంకులు లేకుండా విశ్వవిద్యాలయాలు వెనుకబడుతున్నాయి. జాతీయబ్యాంకులతో ఒప్పందం చేసుకుని పలు యూనివర్సిటీలకు ఆర్థిక సహకారం కల్పిస్తున్నారు. తద్వారా విశ్వవిద్యాలయాల ఆర్థిక మూలాల ఆధారంగా సాయం అందుతోంది. 90శాతం రాష్ట్రప్రభుత్వం 10శాతం విశ్వవిద్యాలయాలు రుణాలు చెల్లించేందుకు 15ఏళ్ల కాలం గడువు ఉంది. ఇలా పలు యూనివర్సిటీలు రుణం కోసం ప్రయత్నాలు చేస్తున్నాయి. గ్రాంట్ల కొరతతో రాష్ట్రంలోని యూనివర్సిటీలు తమ పరిధిలోని అఫిలియేటెడ్ కాలేజీలకు ఒనగూరే విద్యార్థుల ఫీజులు, మార్క్స్ కార్డులు, పట్టాల కోసం చెల్లించే మొత్తం కొంతమేర వెసలుబాటు అవుతోంది. అన్ని విశ్వవిద్యాలయాలకు ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి విన్నవించినా అనుమతులు ఇవ్వకపోవడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. యూనివర్సిటీలకు గ్రాంట్లు పెరిగితే ఉన్నత విద్యలో గుణాత్మకత, పరిశోధనా విభాగాలకు సహకరించినట్లు అవుతుంది.



మైసూరు యూనివర్సిటీ

సామాజిక బహిష్కరణ అమలు చేస్తే

కఠిన చర్యలు

- ప్రత్యేక బిల్లుకు కేబినెట్ తీర్మానం
- పలు నిర్ణయాలకు మంత్రిమండలి ఆమోదం

బెంగళూరు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా సరే సామాజిక బహిష్కరణ అమలు చేస్తే కఠిన చర్యలు తీసుకునేలా ప్రత్యేక బిల్లును మంత్రివర్గం ఆమోదించింది. గురువారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. 41 అంశాలకు ఆమోదం తెలిపారు. కేబినెట్ తీర్మానాలను శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి హెచ్‌కే పాటిల్‌స మీడియాకు వివరించారు. సామాజిక బహిష్కరణ నియంత్రణకు పరిహార విధేయక 2025 బిల్లుకు ఆమోదం తెలిపామన్నారు. గ్రామం లేదా కాలనీల నుంచి ఎవరినీ బహిష్కరించేందుకు వీలు లేదన్నారు. పూజలకు వెళ్ళకుండా అడ్డుకోరాదన్నారు. మానవహక్కుల నిరాకరించినా లేదా ద్వేషపూరితమైన భాష నిషేధం బిల్లును ఆమోదించామన్నారు. ఇటీవలే ద్వేషభాషపై సుప్రీం కోర్టు తీవ్రంగా పరిగణించిందన్నారు. మూడేళ్ళ జైలుశిక్షతో పాటు జరిమానా విధించేలా బిల్లులో పొందుపరచినట్లు తెలిపారు వివిధ ప్రాంతాల్లో బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయాల నిర్మాణాలకు అవసరమైన భూమిని మార్కెట్ విలువలో 5శాతంకు ఇచ్చేలా తీర్మానించారు. దేవనహళ్ళి పరిధిలో 13 గ్రామాల పరిధిలో 1777 ఎకరాల భూమిని పారిశ్రామిక వాడకు కేటాయించేలా తీర్మానించారు. హెబ్బాళ జంక్షన్‌నుంచి మేక్రి సర్కిల్ దాకా ట్రాఫిక్ నియంత్రణకు మూడులైన్‌ల సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేసేలా ఆమోదించారు. బెళగావి శాసనసభ శీతాకాల సమావేశాలలో తీవ్రంగా చర్చించిన అంశాలపై మాట్లాడారు. మొక్కజొన్న, చెరుకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే విషయమై చర్చించారు. గ్లోబల్ ఇన్వెస్టర్ మీట్ నిర్వహణ పరిష్కృత ఖర్చు రూ.100.70 కోట్ల ఆమోదిస్తూ తీర్మానించారు. రాజీవ్‌గాంధీ వైద్య విశ్వవిద్యాలయంకు అనుబంధంగా పలు ప్రాంతాలలో అభివృద్ధికి రూ.452 కోట్లకు ఆమోదించారు. మైనార్టీశాఖ ద్వారా 19 మొరార్జీదేశాయి రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.304 కోట్లు కేటాయించారు. మండ్య జిల్లా కేఆర్ పేట తాలూకాలోని గోడహొసహళ్ళి వద్ద హేమావతి నది నుంచి రెండు తాలూకాల పరిధిలో చెరువులకు ఎత్తిపోతల ద్వారా నీరు మళ్ళించేందుకు రూ.67 కోట్లకు అనుమతించారు. విజయపుర జిల్లా ఇండి తాలూకాలో పలుగ్రామాల్లో 9215 హెక్టార్ల తాగు,సాగు నీటి కోసం నిర్మాణాలకు రూ.485 కోట్లు కేటాయిస్తూ తీర్మానించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలకృష్ణ భార్య పేరుతో

రూ.12వేల కోట్ల భూమాయ

- మరో ఇద్దరితో కలిసి 500 ఎకరాల కబ్జా
- లోకాయుక్త, ఈడీలకు ఎన్‌ఆర్ రమేష్ ఫిర్యాదు

బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలకృష్ణ భార్య రాధ, బీబీఎంపీ మాజీ డిప్యూటీ మేయర్ బీఎస్ మాలతోపాటు ఇద్దరు ఐఏఎస్ అధికారులు, కేఏఎస్ అధికారులు రూ.12వేల కోట్ల విలువైన 500 ఎకరాల భూకబ్జాకు పాల్పడినట్లు లోకాయుక్త అధికారులకు బీజేపీ నేత ఎన్‌ఆర్ రమేష్ ఫిర్యాదు చేశారు. గురువారం లోకాయుక్త కార్యాలయం వద్ద రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. బెంగళూరు దక్షిణ తాలూకా తావరెకెరె హోబళి పరిధిలో అనేక గ్రామాల్లో సుమారు 1600 ఎకరాల కంటే ఎక్కువ భూమి ప్రభుత్వానికి చెందినది ఉందన్నారు. 2006లో ఎటీ రామస్వామి కమిషన్ స్పష్టంగా నిర్ధారించిందన్నారు. 500 ఎకరాల భూమికి నకిలీ రికార్డులు తయారు చేసి సొంతం చేసుకున్నారన్నారు. సదరు భూమి విలువ ప్రస్తుత మార్కెట్‌లో రూ.12వేల కోట్లకు పైగా ఉంటుందన్నారు. నకిలీ రికార్డుల తయారుకు సంబంధించి సమగ్ర ఆధారాలు సేకరించామన్నారు. 8,879 పేజీలతో ఆధారాలను లోకాయుక్తకు ఫిర్యాదు చేశానన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఇదో అత్యంత భారీ కుంభకోణమని వేల కోట్ల మేర అవినీతి జరిగిందని సమగ్రవిచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. అధికార కాంగ్రెస్‌కు చెందినవారు ఉన్నందునే లోకాయుక్తకు ఫిర్యాదు చేశామన్నారు.



లోకాయుక్తకు అందజేసిన రికార్డులను చూపుతున్న ఎన్‌ఆర్ రమేష్

అఖిలపక్ష భేటీకి సీఎం ఆహ్వానం

- హాజరు కాలేమన్న కేంద్రమంత్రులు జోషి, సోమణ్ణ
- పలువురు బీజేపీ ఎంపీలదీ అదేమాట

బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సంబంధించిన గ్రాంట్‌లతో పాటు కేంద్రం నుంచి రావాల్సిన బిల్లులు తదితర సౌలభ్యాలకు సంబంధించి పార్లమెంటులో చర్చించేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్ని పార్టీల ఎంపీలను సభకు ఆహ్వానించారు. ఈనెల 8వ తేదీన ఢిల్లీలో ప్రత్యేక సభ ఏర్పాటు చేసినట్లు లోక్‌సభ, రాజ్యసభకు చెందిన ఎంపీలు అందరికీ లేఖలు పంపారు. ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి టిబి జయచంద్ర ప్రత్యేకంగా ఏర్పాట్లకు సిద్దమయ్యారు. కానీ ఈనెల 8న సోమవారం ముందుగా ఖరారైన కార్యక్రమాలు ఉన్నందున హాజరుకాలేమని కేంద్ర పౌర ఆహార సరఫరాల శాఖామంత్రి ప్రహ్లాద్‌జోషి గురువారం ముఖ్యమంత్రికి ప్రత్యేక లేఖ రాశారు. అంతలోనే ఢిల్లీలోనే పలు కార్యక్రమాలలో పాల్గొనాల్సి ఉన్నందున రాలేమంటూ కేంద్రమంత్రులు నిర్మలాసీతారామన్, కుమారస్వామి, శోభాకరంద్లాజె, సోమణ్ణ తెలిపారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులుగా అందుబాటులో ఉండమని తేల్చిన మేరకు అఖిలపక్ష ఎంపీల భేటీ వాయిదా పడే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రం నుంచి 28మంది లోక్‌సభ సభ్యులు ఉండగా వారిలో కాంగ్రెస్‌కు చెందినవారు 9 మంది ఉన్నారు. జేడీఎస్ నుంచి ఇద్దరు కాగా 17మంది బీజేపీ సభ్యులు ఉన్నారు. కాగా మరికొంత మంది బీజేపీ ఎంపీలు కూడా అందుబాటులో ఉండమంటూ సమాచారం ఇస్తున్నారు. వందేమాతరంకు 150 ఏళ్ళు అయిన సందర్భంగా ప్రత్యేక సమావేశంలో ఎక్కువ మంది మంత్రులు, ఎంపీలు పాల్గొననున్నారు. దీంతో సీఎం నిర్వహించదలచిన అఖిలపక్ష ఎంపీల భేటీ వాయిదా పడనున్నట్లు తెలుస్తోంది. కాగా కాంగ్రెస్‌కు చెందిన ఎంపీలతో పాటు రాష్ట్ర మంత్రుల అభిప్రాయం మేరకు పార్లమెంటు సమావేశాలు ఉన్న సమయంలో కాకుండా తర్వాత అంటే సభ జరపడంలో అర్థం ఉండదని విమర్శిస్తున్నారు.



హస్తినకు చేరిన బీజేపీ నేతలు

- కేంద్రమంత్రులతో భేటీ

బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో గ్రూపువిభేధాల అంశం కాస్త చల్లబడిన తరుణంలోనే బీజేపీలో విభేధాలు హస్తినకు చేరుకున్నాయి. రెండురోజులుగా రాష్ట్ర బీజేపీకి చెందిన రెబల్ గ్రూపు నాయకులు.. ప్రముఖులను కలుస్తున్నారు. ఎమ్మెల్యేలు సతీష్‌జార్కిహోళి, హరిహర ఎమ్మెలే బీపీ హరీష్, కేంద్ర మాజీ మంత్రి జీఎం సిద్దేశ్వర్, మాజీ ఎమ్మెల్యే కుమార బంగారప్ప తదితరులు బీజేపీ కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జి రాధా మోహన్‌దాస్‌తో పాటు కేంద్రమంత్రి కుమారస్వామిని గురువారం కలిశారు. ఇద్దరు నేతలతో రాష్ట్ర బీజేపీలో సాగుతున్న పరిణామాలపై సుదీర్ఘంగా వివరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను మార్పు చేయాలనే ప్రతిపాదనలు బలంగా చేసినట్లు తెలుస్తోంది. కాగా ఇదే విషయమై విధానపరిషత్ ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామి బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిని దించి వారు ఏం చేయాలనుకున్నారని ప్రశ్నించారు. ఎవరికి ప్రజాబలం ఉందో వారినే అధ్యక్షుడిగా అగ్రనేతలు ఎంపిక చేస్తారన్నారు.



కేంద్రమంత్రి కుమారస్వామితో బీజేపీ నాయకులు



వెంకటేష్, దేవీ దంపతులు (ఫైల్)

వీల్ చెయిర్‌కే పరిమితమైన

భార్యను చంపి..

భర్త ఆత్మహత్య

7



విద్యుత్ దీపాల కాంతుల్లో క్రిస్మస్ ట్రీ

75 అడుగుల క్రిస్మస్ ట్రీ

బెంగళూరు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): నగరానికి క్రిస్మస్ శోభ వచ్చింది. మాల్ ఆఫ్ ఏసియాలో 75 అడుగుల ఎత్తైన క్రిస్మస్ ట్రీని లాంచనంగా ఆవిష్కరించారు. యూరోపియన్ థీమ్‌తో ఏర్పాటు చేశారు. రాణా విజయ్ సింగ్, ప్రిన్స్ నరులా, నిఖిల్ చన్నప్ప, ప్రియాంకశర్మ, రాజీవ్‌లక్ష్మణ్, అరుణ్‌శర్మలతోపాటు పలువురు సెలిబ్రిటీలు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యుద్దీపాలతో క్రిస్మస్ ట్రీ మరింత ఆకర్షణగా దర్శనమిస్తోంది. స్ట్రీట్, పండుగ సంప్రదాయం తరహాలో ప్రత్యేకమైన వస్తు ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



రోజీ స్టార్లింగ్ పక్షి


హాయ్..

రోజీ..!

విజయనగర జిల్లా పరిధిలోనిహగరి బొమ్మనహళ్ళి పట్టణ శివారు చింత్రపల్లి సరస్సు వద్ద విదేశాల నుంచి విచ్చేసిన 'రోజీ స్టార్లింగ్' పక్షులు సందడి చేస్తున్నాయి. గుంపులుగా ఎగురుతున్నాయి. రంగురంగుల పక్షుల కిలకిల ధ్వనులతో ఈ ప్రాంతం సందడిగా మారింది. పర్యాటకులు విశేష అనుభూతి పొందుతున్నారు.

7లో

సరస్సు వద్ద పక్షుల గుంపు



కాకర.. తీపి..!

- ఆశాజనకంగా ధరలు
- కిలో రూ.50 పలుకుతున్న వైనం
- అన్నదాతకు లాభాలు



చిన్నపల్లి వద్ద సాగుచేసిన కాకర పంట



దిగుబడి, ధరలు బాగుండడంతో లాభాలు

తనకల్లు మండలంలో 40 ఎకరాల భూములు కొనుగోలు చేశా. మరో 80 ఎకరాలు లీజుకు తీసుకుని, పలు పంటలు సాగు చేస్తున్నా. ఈప్రాంత భూములు కూరగాయలు, పండ్లతోటల సాగుకు అనుకూలం. కాకర మొట్టమొదటి సారి సాగుచేశా. దిగుబడి, ధరలు బాగుండడంతో లాభాలు వస్తున్నాయి.

- రామలింగరాజు, కాకినాడ



తనకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చేదైన కాకర తియ్యటి లాభాలు పంచుతోంది. మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా పలుకుతుండడంతో అన్నదాతకు లాభాల పంట పండుతోంది. కిలో రూ.50 వరకు అమ్ముడవుతున్నాయి. మండలంలో ఏడాది పొడవునా కూరగాయ పంటలు సాగుచేసి, బెంగళూరు, చెన్నై మార్కెట్లకు తరలిస్తుంటారు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి రబీ ప్రారంభం వరకు కూరగాయలు సాగుచేసిన రైతులు నష్టాలబాట పట్టారు. ధరలులేక ఇబ్బందులు పడ్డారు. వ్యాపారులు అడిగిన రేటుకి ఇచ్చుకోవాల్సి వచ్చింది. కొన్నిరోజులుగా కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. కాకరకు ఉన్నట్లుండి ధరలు పెరిగాయి. దీంతో అన్నదాత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మందులు అవసరంలేని పంట

కాకినాడకు చెందిన రామలింగరాజు తనకల్లు మండలంలోని చిన్నపల్లి వద్ద రెండెకరాలు లీజుకు తీసుకుని, కాకర సాగుచేశాడు. ఎకరాకి రూ.60 వేల వరకు పెట్టుబడులు పెట్టాడు. దిగుబడి ఆశాజనకంగా ఉంది. ధరలు కూడా బాగున్నాయి. రైతు వినూత్నంగా ఆలోచించి కాకర కాయలను బాక్సుల్లో నింపి తరలిస్తున్నారు. సాధారణంగా కాకరను సంచుల్లో వేసుకుని, మార్కెట్‌కు తరలిస్తున్నారు. తాజాగా కనిపించక ధర పెద్దగా దక్కదని రైతు అభిప్రాయపడుతున్నారు. బాక్సుల్లో వేసుకుని తరలిస్తే.. తాజాగా ఉంటూ మంచి ధరకు అమ్ముడవుతాయని చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లలో కాకర కిలో రూ.50 వరకు ధర పలుకుతోంది. కాకర వారానికో కోత పడుతోంది. ప్రతి కోతకు 2 టన్నుల దాకా దిగుబడి వస్తోంది. ఈ లెక్కన రూ.లక్ష వరకు రైతుకు ఆదాయం సమకూరుతోంది. ఇలా.. 30 కోతలు పడతాయని రైతు చెబుతున్నారు. ధరలు ఇలాగే ఉంటే.. రూ.30 లక్షల వరకు లాభం వస్తుందని రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటకు పెద్దగా పురుగు మందులు కూడా అవసరంలేదు. దోమ నివారణకు పురుగు మందులు పిచికారీ చేసుకుంటే సరిపోతుంది. టమోటా పంటతో పోల్చితే పురుగు మందుల అవసరం తక్కువే. ఆరోగ్యానికి కాకర కాయ ఎంతోమందని వైద్యులు చెబుతున్నారు. మధుమేహం నియంత్రణలో ఉండడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని సూచిస్తున్నారు.

కాకరకాయలను బాక్సుల్లోకి నింపుతున్న కూలీలు



రికార్డులు గల్లంతు...!

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల కోసం రైతులు, ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. భూమికి సంబంధించి ఏవైనా పాత రికార్డులు తెచ్చుకోవాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రతి భూమికి సంబంధించిన రికార్డులు తహసీల్దార్ కార్యాలయంలో తప్పనిసరిగా ఉండాలి. అది అసైన్డ్ భూమా, చుక్కల భూమా, దేవదాయ శాఖ భూముల వివరాలతో పాటు ప్రైవేట్ భూమి అయితే సంబంధిత డైక్లాట్ వివరాలు, గతంలో సబ్ డివిజన్ జరిగి ఉంటే వాటికి సంబంధించి రికార్డులు పక్కాగా ఉండాలి. కొన్ని భూములకు సంబంధించిన రికార్డులు సంబంధిత డివిజన్‌కు చెందిన ఆర్డీఓ కార్యాలయంలోనూ ఉండాలి. ప్రతి భూమికి తప్పనిసరిగా..1బీ, అడంగల్, స్కెచ్, ప్లాన్, 8ఏ, 10వన్ ఫైల్స్ అవసరం. కానీ ప్రజలకు ఆ రికార్డులు ఏమీ లేనట్లు చెబుతున్నారు. ఉన్నవాటిని వెతికి పెట్టడానికి నెలల తరబడి తిప్పుకుంటున్నారనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. లేదంటే పైసలు ముట్టజెబితే అందుబాటులో ఉన్నవి అందజేస్తున్నారనే ఆరోపణలున్నాయి. తమకు కావాల్సిన రెవెన్యూ రికార్డుల కోసం వివిధ వర్గాల ప్రజలు, రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

ఎన్నాళ్లు అడుక్కోవాలి..?

- గార్లదిన్నె మండలం జంబులదిన్నెలో రీ సర్వే పూర్తయింది. కొన్ని భూములు జాయింట్ ఎల్‌పీఎం కింద పెట్టడంతో రిజిస్ట్రేషన్ చేసుకోలేక సంబంధిత రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆ గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి సర్వేనంబరు-37కు చెందిన ఐదెకరాల భూమికి సంబంధించి గతంలో జరిగిన సబ్‌డివిజన్ కాపీ 8ఏ, 10వన్ కాపీల కోసం గత ఆరునెలలుగా తిరుగుతున్నాడు. కానీ తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఆ రికార్డుల్లేవంటూ తిప్పి పంపుతున్నారు. తరచూ పై అధికారులకు ఫిర్యాదు చేయడంతో చివరకు 10వన్ కాపీ ఇచ్చారు. ఇక 8ఏ కాపీ మాత్రం లేదంటున్నారు. ఆ ఫైల్ ఆర్డీఓ కార్యాలయంలోనూ లేదని చెబుతుండటం గమనార్హం. ఇదే గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయంలో కొందరు రెవెన్యూ రికార్డుల కోసం తిరుగుతున్నా లేవనే చెబుతున్నట్లు సమాచారం.
- ఆత్మకూరు మండలం వడ్డుపల్లి పరిధిలో ఓ వ్యక్తి 40సెంట్లు కొనుగోలు చేశారు. లీగల్ ఒపీనియన్ కోసం గతంలో జరిగిన సబ్ డివిజన్‌కు సంబంధించి 8ఏ ఫైల్ కావాలని కోరారు. అయితే ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆ ఫైల్ లేదని చెప్పారట. అప్పట్లో కాలిపోయిందని, అవి దొరకవని, పాత ఫైల్ కదా ! అవి ఇంకా ఎక్కడుంటాయని సిబ్బంది సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఆ ఫైల్ ఆర్డీఓ ఆఫీస్‌లోనూ లేదని చెప్పారు.
- జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు డివిజన్ల పరిధిలో 32 మండలాలున్నాయి. వీటిలో దాదాపు 20 నుంచి 25 మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రతి మండలంలోనూ భూములకు సంబంధించి 1బీ, అడంగల్, స్కెచ్, ప్లాన్ 8ఏ, 10వన్ కావాలంటే రూ.వెయ్యిల నుంచి రూ.5వేల వరకు ఫైల్‌ను బట్టి పైసలు పుచ్చుకుంటున్నట్లు బహిరంగ ఆరోపణలున్నాయి.

ఆ రెండు ఫైళ్లు ఎక్కడ..?

ఏ భూమికైనా గతంలో జరిగిన సబ్ డివిజన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఆ వివరాలు 8ఏ కాపీలో అందజేస్తారు. కానీ కొన్ని చోట్ల ఆ పత్రాలు కనిపించడం లేదు. బుక్కరాయసముద్రం మండలం గోవిందంపల్లి సమీపంలో 544 డీ హైవే రోడ్డు పనులు జరుగుతుండటంతో ఆ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం గోవిందంపల్లి భూములు ఎకరం రూ.కోటికి పైగా పలుకుతున్నాయి. వీటికి సంబంధించిన 8ఏ, 10వన్ ఫైళ్లు తహసీల్దార్ కార్యాలయంలో కనిపించడం లేదని తెలిసింది. ఇక్కడ కొందరు ఘనులు ఆ ఫైళ్లను అమ్మేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ భూములకు ధరలు భారీగా పలకడంతో భూమాయ కోసం వాటిని అమ్మేశారనే విమర్శలున్నాయి. కొందరు సమాచార హక్కు చట్టం మేరకు అడిగినా లేవంటూ రాసిచ్చారట. చివరకు జిల్లా కలెక్టర్‌కు అడిగినా దిక్కు లేకుండా పోయిందని వాటి కోసం వెతికుతున్నవారు చెబుతున్నారు.

దగ్ధం అయ్యాయనే సాకు...

రెవెన్యూ రికార్డుల్లో 1బీ, అడంగల్ త్వరగా వెతికి ఇచ్చే పత్రాలు. అవి ఇవ్వడానికి కూడా రోజుల తరబడి తిప్పుతున్నారు. డబ్బులు ఇస్తే మాత్రం త్వరగా అందజేస్తున్నారు. రాప్తాడు, ఆత్మకూరు, కూడేరు మండలాల్లో ఏ రికార్డు కోసం పోయినా లేవని చెబుతుంటారు. ఎప్పుడో కాలిపోయిన చరిత్ర గురించి వల్లెవేస్తూ, ఏమీ లేవండి అన్నీ కాలిపోయాయంటున్నారు. ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయాన్ని మూడు దశాబ్దాల కిందట కాల్చివేశారు. ఆ సమయంలో ఎన్ని ఫైళ్లు దగ్ధమయ్యాయో, ఎన్ని మిగిలాయో తెలియదు కానీ అప్పట్లో జరిగిన సబ్ డివిజన్ కాపీలతో పాటు చాలా రికార్డులు లేవంటుంటారు. ఇక కూడేరు తహసీల్దార్ కార్యాలయం 1995-96లో నక్సలైట్లు కాల్చివేశారు. అప్పట్లో రికార్డు రూమ్ కాలిపోలేదని సమాచారం. పాత రికార్డుల కోసం అడిగితే చాలు లేవని సమాధానం చెబుతారు. ఆ ముసుగులో కొన్ని కాల్చివేశారు, అమ్మివేశారనే ఆరోపణలున్నాయి. ఆ మండలంలో లెక్కలేనన్ని వివాద భూములున్నాయి. నకిలీ ఎన్‌ఓసీలు సైతం పుట్టించారు. ఇక రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో 2016లో మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి హత్య జరిగిన సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి నిప్పంటించారు. ఆ సమయంలో చాలా వరకు ఫైళ్లు కాలిపోయాయి. కానీ పాత రికార్డుల కోసం అడిగితే చాలా వరకు లేవనే చెబుతున్నారు. దీంతో ఆ మూడు మండలాల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో క్లాక్‌టవర్ సమీపం నుంచి డీఆర్‌డీఏ కార్యాలయ భవన సముదాయంలోకి మార్చారు. అప్పట్లో డివిజన్ పరిధిలో 19 మండలాలుండేవి. ఇప్పుడు 13మండలాలున్నాయి. మార్చిన సమయంలో కొన్ని రికార్డులు మాయమయ్యాయో లేక మతలబు చేశారో తెలియదు కానీ ఎన్నో రికార్డులు లేవని చెబుతుంటారు.

రికార్డులు లేవనడం సరికాదు

భూములకు సంబంధించిన పాత రెవెన్యూ రికార్డులు లేవనడం సరికాదు. ప్రతి రికార్డు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయంతో పాటు సర్వే శాఖ ఏడీ కార్యాలయంలో ఉండాలి. గడువు తీసుకున్నా రికార్డులు ఇవ్వాల్సి ఉంటుంది. సబ్ డివిజన్‌కు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో ఉండాల్సిందే. రాప్తాడు, ఆత్మకూరు, కూడేరు తహసీల్దార్ కార్యాలయాల్లోనూ కొన్ని రికార్డులు కాలిపోయాయి. కలెక్టర్‌తో చర్చించి రికార్డుల విషయంలో రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటాం.

- శివనారాయణ శర్మ, జాయింట్ కలెక్టర్

కాలువకు ఊపిరి..!

తాడిమర్రి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తాడిమర్రి మండలంలో పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడికాలువ ఉంది. కాలువ చివరి ప్రాంతం కావడంతో ఏటా నీరు అరకొరగానే అందుతోంది. పట్టుమని పక్షం రోజులు కూడా నీరు వదలరు. దీంతో ఆయకట్టు సంగతి దేవుడెరుగు.. తాగునీటికి కూడా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి దాపురిస్తోంది. టీడీపీ హయాంలో కాలువకు నీరిచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించారు. తాడిమర్రిమండలంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల ద్వారా కాలువకు నీరివ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు డీపీఆర్ కూడా సిద్ధం చేశారు. పనులు పూర్తయితే నీటి కష్టాలు తీరుతాయని తాడిమర్రి, బత్తలపల్లి మండలాల ప్రజలు సంతోషించారు. టెండర్లకు వెళ్లే దశలో ఎన్నికలు రావడం, వైసీపీ అధికారం చేపట్టడంతో జనం ఆశలు అడియాసలయ్యాయి. ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని ఐదేళ్లూ అటకెక్కించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎత్తిపోతల పథకం మళ్లీ తెరపైకి వచ్చింది. పనులు చేపట్టే దిశగా అడుగులు పడుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా కొత్తగా డీపీఆర్ తయారు చేసి, ప్రభుత్వ ఆమోదానికి పంపనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే కుడి కాలువకు ఊపిరి పోసినట్లే.

సాగులోకి రానున్న 20 వేల ఎకరాలు..

తాడిమర్రి మండలంలోని సీబీఆర్ నీటిని మరువపల్లి సరిహద్దు ప్రాంతాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా పీఏబీఆర్ కుడికాలువకు తరలించనున్నారు. దాదాపు 14 కిలోమీటర్ల మేర పైపులైన్ ఏర్పాటుచేసి మన్నీల వద్ద పీఏబీఆర్ కుడికాలువలోకి కలపనున్నారు. తద్వారా బత్తలపల్లి మండలంలోని అప్రాచెరువు, యర్రాయపల్లి, లింగారెడ్డిపల్లి, ఎం చెర్లోపల్లి, బత్తలపల్లి, మాల్యవంతం, తాడిమర్రి మండలంలోని ఏకపాదంపల్లి, పుల్లప్పల్లి, పిన్నదరి, పుల్లానారాయణపల్లి, భీమరాయనిపేట, తాడిమర్రి, మద్దలచెరువు, నిడిగల్లు, నారసింపల్లి, మేడమాకులపల్లి, మరువపల్లి, అగ్రహారం, ఆత్మకూరు గ్రామాలకు తాగు, సాగునీరు అందించవచ్చు. ఇందుకు సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టును 2017లో అప్పటి అధికారులు తయారుచేశారు. భూసేకరణ అవసరంలేదనీ, కుడికాలువ వెంబడే పైపులైన్ కూడా ఏర్పాటుచేయవచ్చని తేల్చారు. అందుకు ఆమోదం లభించేలోపే ఎన్నికలొచ్చాయి. అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ పాలకులు.. ఆ ప్రాజెక్టును అటకెక్కించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తాడిమర్రి, బత్తలపల్లి మండలాలకు సంబంధించి సాగు, తాగునీరు అందించే ప్రాజెక్టులలో పెండింగ్ ఉన్న వాటి గురించి ఆరాతీసినట్లు తెలుస్తోంది. అందులో పీఏబీఆర్ పొడిగింపు కాలువ, ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సంబంధించిన ఫైళ్లకు దుమ్ముదులుపుతున్నారు. అందులో భాగంగానే లిఫ్ట్ ఏర్పాటుకు పాలకుల నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించినట్లు తెలిసింది. ఏర్పాటైతే తాడిమర్రి, బత్తలపల్లి మండలాలకు సంబంధించి దాదాపు 20వేల ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చే అవకాశం ఉంది.

బంగారు పంటలు పండిస్తాం..

అరకొర నీటితోనే నాణ్యమైన పంటలు పండిస్తున్నాం. పూర్తిస్థాయిలో నీరిస్తే బంగారు పంటలు పండించగలం. సాగునీటి కష్టాలు తీరనుండడం ఆనందంగా ఉంది.

-రామచంద్రారెడ్డి, రైతు, శివంపల్లి

పరోపకారి..!



రోడ్డుకు అడ్డంగా రాళ్లు వేస్తున్న దామోదర్ రెడ్డి

ఇది పెనుకొండ నుంచి కోనాపురం వెళ్లే రోడ్డు. ఇటీవలే కొత్తగా రోడ్డు వేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆ దారిలోని కొండాపురం మలుపు వద్ద కాలువ పైప్‌లైన్ పగిలింది. దానిపై మట్టికుప్పలు అడ్డుగా వేశారు. ఒకపక్క కొంతస్థలం ఖాళీగా ఉండటంతో నిత్యం విద్యార్థులు, స్థానికులు ఆ కొంచెం దారిలోనే ద్విచక్రవాహనల్లో వెళ్తున్నారు. అదుపుతప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. గ్రామానికి చెందిన పలువురు గాయపడ్డారు కూడా. అదే దారిలో పాఠశాలకు వెళ్లే కోనాపురానికి చెందిన బాలుడు దామోదర్ రెడ్డి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలనుకున్నాడు. రాళ్లను తీసుకొచ్చి.. ఇలా.. ఆ చిన్న రోడ్డును మూసివేస్తున్నాడు. మరొకరు ప్రమాదాల బారిన పడకూడదన్న పెద్ద మనసుతో గురువారం ఇలా రాళ్లు వేశాడు. పెద్ద మనసు కలిగిన పిల్లాడు కదూ..

-పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి)



భక్తిశ్రద్ధలతో ఆకాశ దీపోత్సవం

తాడిపత్రి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆకాశ దీపోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపోత్సవాన్ని పెద్దఎత్తున భక్తులు తిలకించారు

← దీపోత్సవం నిర్వహిస్తున్న పండితులు

రూ.30 కోట్లతో వేదవతిపై వంతెన

- భూమిపూజ చేసిన ఎమ్మెల్యే అమిలినేని



కన్నెపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

బ్రహ్మసముద్రం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలం కన్నెపల్లి నుంచి భూపసముద్రం వరకు నాబార్డు నిధులు రూ. 30 కోట్లతో వేదవతినదిపై వంతెన, తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కన్నెపల్లి గ్రామంలో నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. వంతెన నిర్మాణం టెండర్ల కోసం కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో తనకు తెలిసిన ఒక పెద్ద కాంట్రాక్టర్‌ను ఒప్పించానని, యేడాదిన్నర లోపు దీన్ని నిర్మించి.. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు నేడు పేరుతో పాఠశాలల్లో అసంపూర్తిగా పనులను వదిలేసిందని, వాటిని దాతల సహకారంతో పూర్తి చేస్తామని చెప్పారు. కన్నెపల్లిలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాన్ని యేడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 39 రోడ్లు మంజూరైతే.. అందులో మన నియోజకవర్గానివే 24 ఉన్నాయన్నారు. జగన్మోహన్‌రెడ్డి కేసులు మాఫీ కోసం ఢిల్లీకి విమానాల్లో తిరిగేందుకే రూ.222 కోట్లు ఖర్చు చేశాడన్నారు. నియోజకవర్గంలోని 72 పంచాయతీల్లో ఫ్రీజర్ శవపేటికలను, ప్రతి మండలకేంద్రానికి ఒకటి ఒక వ్యాన్‌ను సొంత నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాక్టర్ బోల్తాపడి గాయ పడి.. బెంగళూరులో చికిత్స పొందుతున్న ఇద్దరు కూలీలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎల్‌ఓసీని మూడు రోజుల్లోగా తెప్పించామని, అందులో అనసూయమ్మకు రూ. ఆరు లక్షలు, మరొకరికి రూ.4 లక్షలు వచ్చిందన్నారు. బీటీపీతో పాటు 114 చెరువులకు నీళ్లు ఇచ్చి ప్రజల వద్దకు వెళతామన్నారు.

విచ్చలవిడిగా గంజాయి

హిందూపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. పోలీసులు పట్టించుకపోవడంతో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయి గొడవలకు దిగుతోంది. పట్టణాల్లోనే కాకుండా పల్లెలకు కూడా గంజాయి మత్తు పాకుతోంది. చాలామంది విద్యార్థులు, యువత దీనికి అలవాటుపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. మరికొంత మంది యువకులు దాడులకు దిగుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకువచ్చి పెనుకొండ, సోమందేపల్లి ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం. దీనిని తీసుకున్న యువత మత్తులో ఏమి చేస్తున్నారో తెలియక విచక్షణ కోల్పోతోంది.

మచ్చుకు కొన్ని..

ఏడాది క్రితం సోమందేపల్లిలోని మార్కెట్ రోడ్డులోగంజాయి మత్తులో యువకులు కత్తులతో దాడులు చేసుకున్నారు. వారు ఎందుకు దాడులు చేసుకున్నారో తెలియక అక్కడ ఉన్న జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. తరువాత ఆ యువకులు గంజాయి సేవించినట్లు తెలిసింది. ఇదే గ్రామంలోని గీతా నగర్‌లో ఓ ఉద్యోగి కుటుంబంపై గంజాయి మత్తులో ఉన్న యువకులు దాడులకు పాల్పడ్డారు. కొద్ది నెలల క్రితం సోమందేపల్లిలో అర్ధరాత్రి బైక్‌పై వెళుతూ మత్తులో కిందపడి ఒకరు మృతి చెందారు. నక్కలగుట్ట సమీపంలో హంద్రీనీవా కాలువ వద్ద ముగ్గురు యువకులు బైక్‌పై వెళుతుండగా ఒకరు దుర్మరణం చెందారు. వీరు గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసులే పేర్కొన్నారు. ఇటీవల ఇదే గ్రామంలో ప్రధాన కూడలిలో గంజాయి మత్తులో ఉన్న యువకులు బాహాబాహీకి దిగగా పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. రెండు నెలల క్రితం పెనుకొండ సమీపంలో జాతీయ రహదారిపై గంజాయి సేవించిన నలుగురు యువకులు వాహనాలను ఆపే ప్రయత్నం చేశారు. అటుగా వెళ్లిన ఓ పోలీస్ అధికారి గంజాయి మత్తులో ఉన్నారని అనుమానించి వారిని అక్కడి నుంచి పంపేసి ఒగకూరు వైపు వెళ్లారు.

వైసీపీ హయాంలో బీజం

ఈ ప్రాంతంలో గంజాయి అంటే చాలా మందికి తెలియదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ వ్యాపారానికి బీజం పడింది. ఇప్పుడు గంజాయి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఒకప్పుడు పట్టణాల్లో మాత్రమే దొరికే ఈ మత్తు గ్రామాల్లోనూ విరివిగా లభిస్తోంది. అక్రమార్జనకు అలవాటు పడిన గంజాయి ముఠా విసురుతున్న వలలో యువత చుట్టుకొని విలవిలాడుతోంది. వైసీపీ హయాంలో వివిధ రూపాల్లో గంజాయి యువతకు చేరుతూ వచ్చింది. ప్రస్తుతం పోలీసులు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా గంజాయి సరఫరా మాత్రం ఆగడం లేదు. వైసీపీ హయాంలో గంజాయి మన రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా అయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కట్టడికీ శ్రీకారం చుట్టింది. దీంతో హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో పనిచేసే ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు అక్కడి నుంచే తీసుకువస్తున్నట్లు తెలిసింది. సోమందేపల్లి, పెనుకొండకు చేర్చేందుకు హిందూపురానికి చెందిన కొందరు ఉన్నట్లు సమాచారం. బయటి ప్రాంతాల నుంచి హిందూపురానికి రైళ్లలో తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ప్యాకెట్ల రూపంలో తయారుచేసి సోమందేపల్లి, పెనుకొండ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

విచక్షణ కోల్పోయి దాడులు

గత ఏడాది కాలంగా పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో గంజాయి బ్యాచ్ మత్తులో విచక్షణ కోల్పోతోంది. కొన్ని సందర్భాలలో వారే ప్రాణాల మీదుకు తెచ్చుకుంటుండగా, మరికొంత మంది ఇతరులపై దాడులకు దిగుతున్నారు. సోమందేపల్లిలో చోటుచేసుకుంటున్న ఈ ఘటనలే నిలువెత్తు సాక్ష్యం. పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో వివిధ రూపాల్లో సరఫరా చేస్తున్నట్లు సమాచారం. కొన్ని పాన్ షాపులు, సోడా బండ్లు, ఆటోల అడ్డా వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం

గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రెండు నెలల క్రితం 2.5 కిలోల గంజాయిని సోమందేపల్లిలో పట్టుకున్నాం. కొద్ది రోజులుగా సోమందేపల్లిలో యువత మత్తులో ఉన్న విషయం మా దృష్టికి వచ్చింది. వారు గంజాయి సేవించారా..? లేక ఇతర మత్తు పదార్థాలు వాడారా.? అనే విషయం తేలాల్సి ఉంది. గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

-రఘువరన్, సీఐ

మళ్లీ దెబ్బతిన్న కాలువ గట్టు



కోతకు గురైన కాలువ గట్టు

కణేకల్లు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబిగనురు గ్రామ సమీపంలో గుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) కోతకు గురైంది. నాలుగు నెలల క్రితం కోతకు గురైన కాలువకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఇసుక బస్తాలు అడ్డుగా వేశారు. కాలువపై వాహన రాకపోకలను నిలిపివేశారు. కొన్ని రోజులుగా పెద్ద వాహనాలు ఈ ప్రాంతంలో తిరగడంతో ఇసుక బస్తాలు నీటిలో జారిపోయి.. గురువారం సాయంత్రం మళ్లీ కోతకు గురైంది. నివారణ చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు.

మార్కెట్‌లో మాఫియా..!

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు, పూలు, నిత్యావసర సరుకులు, పండ్ల ధరలు తక్కువగా ఉన్నా.. పాతూరులో మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. దళారీ మా ఫియా పాతూరులో పాతుకుపోయి ప్రజలపై పడి రాబందుల్లా పీక్కుతింటోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చోటామోటా నాయకులుగా చలామణి అవుతున్న దళారీలు సిండికేట్‌గా ఏర్పడి, అడ్డగోలుగా దోచుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వారి ఆగడాలు హెచ్చుమీరుతున్నాయి. పలుమార్లు 'బయట బజారులో తక్కువ ధరకే పూ లు, పండ్లు దొరుకుతున్నా.. మార్కెట్‌లో క్కువ రేటుకు విక్రయిస్తున్నారేంటి?' అని ప్రజలు నిలదీస్తున్నారు. వారితో వ్యాపారులు గొడవకు దిగుతున్నారు. పాతూరు మార్కెట్‌లో దళారీలు చెప్పిందే రేటు.

దళారీలదే పెత్తనం

పాతూరు మార్కెట్‌లో నిత్యం రూ.లక్షల్లో వ్యాపారాలు జరుగుతున్నాయి. ఇక్కడ పూలు మొదలుకుని కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువుల ధరలను నిర్ణయించడంలో దళారీలదే పైచేయిగా నిలుస్తోంది. గతంలో పాతూరులో తక్కువ ధరకే నిత్యావసర వస్తువులు దొరుకుతాయనే నమ్మకం ఉండేది. ప్రస్తుతం మాఫియా ఆగడాలతో ధరలు పైపైకే పెరిగిపోతున్నాయి. సాధారణ బజారులో పూల ధర కిలో రూ.100 ఉంటే.. పాతూరు మార్కెట్‌లో రూ.200-300కి అమ్ముతున్నారు. అలా ప్రజలను దోచుకుతింటున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

అద్దె ఎగవేత

నగరపాలక సంస్థ దుకాణాలకు అద్దె చెల్లించకుండా పలువురు వ్యాపారులు ఎగ్గొడుతున్నారు. పాతూరు మార్కెట్‌లో పలువురు వ్యాపారులు నగర పాలక సంస్థకు చెందిన దుకాణాలు, ఖాళీ స్థలాల్లో వ్యాపారాలు చేసుకుంటూ... అద్దె ఎగవేస్తున్నారు. ప్రతినెలా రూ.30లక్షల వరకు నగరపాలక సంస్థ ఆదాయానికి గండికొడుతున్నారు. మరికొందరు బినామీ పేర్లతో షాపులు నిర్వహిస్తూ... అద్దె వసూలు చేస్తున్నా ఏఎంసీకి చెల్లించకుండా జేబుల్లో వేసుకుంటున్నారు. మార్కెట్‌కు ఆనుకుని నివాసం ఉంటున్న వారు నగరపాలక సంస్థ దుకాణాలను సొంత వాటిగా మార్చేసుకున్నారు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన అద్దె మొత్తాన్ని దళారీలకు కడుతున్నారు.

పాతూరు మార్కెట్‌ను పరిశీలిస్తాం

పాతూరు మార్కెట్‌లో అపరిశుభ్రత, అద్దె ఎగవేతపై పరిశీలిస్తాం. మార్కెట్‌లో కుళ్లిపోయిన కూరగాయలు ఇతర వ్యర్థాలు అక్కడే పడేస్తుండడంతో చెత్త పేరుకుపోయి, దుర్గంధం వస్తోంది. వ్యర్థాలను మున్సిపల్ వాహనంలోనే వేయాలి. మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవడాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలి.

-బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్



మార్కెట్ వద్ద చెత్తాచెదారం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

స్వామి జ్ఞానానంద (జయంతి)



స్వామి జ్ఞానానంద 1896 డిసెంబరు 5న పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం సమీపాన గొరగనమూడి (ప్రస్తుతం పాలకోడేరు మండలం)లో జన్మించారు. అసలు పేరు భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు. యోగిగా, భౌతిక శాస్త్రవేత్తగా పేరొందారు. గౌతమబుద్ధుడి జీవితంతో స్ఫూర్తిపొంది హిమాలయాల్లో పదేళ్లపాటు యోగా, వేదాలపై అధ్యయనం చేశారు. పూర్ణసూత్రాలు గ్రంథాన్ని రచించి ప్రసంగాలు చేశారు. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ అందుకున్నారు. జేమ్స్ చాడ్విక్‌తో కలసి పరమాణు భౌతిక విజ్ఞానశాస్త్రంలో పలు పరిశోధనలు చేసి లండన్‌లో ఫెలోషిప్, అమెరికాలో పురస్కారాలు అందుకున్నారు. 1969 సెప్టెంబరు 21న కన్నుమూశారు. వైజాగ్‌లోని ఆంధ్రా యూనివర్సిటీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు.

వాల్ట్ డిస్నీ (జయంతి)



హాలీవుడ్‌లో పేరొందిన దర్శక, నిర్మాత మిక్కీ మౌజ్ రూపకర్త వాల్టర్ ఎలియాస్ డిస్నీ 1901 డిసెంబరు 5న జన్మించారు. కథా రచయిత, డబ్బింగ్ కళాకారుడిగా వ్యాపారవేత్తగాను రాణించారు. యానిమేషన్ చిత్రాల ద్వారా ఆ రంగానికి అంతర్జాతీయ గుర్తింపు కల్పించారు. కార్టూన్‌ల నిర్మాణంలో ఎన్నో వినూత్నమైన పద్ధతులు ప్రవేశపెట్టారు. 59సార్లు నామినేట్ కాగా 22 ఆస్కార్ అవార్డులతో రికార్డు సృష్టించారు. డిస్నీల్యాండ్ అనే అమ్యూజ్‌మెంట్ పార్క్‌ను ఆయన ఏర్పాటు చేశారు. 1966 డిసెంబరు 15న కన్నుమూశారు.

చాట్ల శ్రీరాములు (జయంతి)



తెలుగు నాటకరంగ కళాకారుడు, సినీ నటుడు చాట్ల శ్రీరాములు 1931 డిసెంబరు 5న బెజవాడలో జన్మించారు. వందకుపైగా నాటకాలలో నటించి దర్శకత్వం వహించారు. ఎమరో మొహంజదారో నాటకం ప్రసిద్ధి చెందింది. లండన్‌లోని బ్రిటీష్ డ్రామా లీగ్‌లో 1970లో నాటక ప్రయోక్తగా, ఆచార్యుడిగా శిక్షణ పొందారు. తెలుగుచలనచిత్ర పరిశ్రమలోని ఎందరో నటీనటులకు శిక్షణ ఇచ్చారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం, ఉస్మానియా తదితర విశ్వవిద్యాలయాలు తమ నాటకరంగ శాఖలకు విభాగాధిపతిగా నియమించాయి. తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. ఉత్తమ నటుడు అవార్డు అందుకున్నారు. 2015లో కన్నుమూశారు.

శ్రీ అరబిందో (వర్ధంతి)



ప్రముఖ తత్వశాస్త్ర శ్రీ అరబిందో ఘోష్ 1872 ఆగస్టు 15న కోల్కత్తాలో జన్మించారు. ఆధ్యాత్మిక భావాలతో యోగి, గురువుగా పేరొందారు. ఆయన రూపొందించిన ప్రత్యేక విధానాన్ని ఇంటెగ్రల్ యోగాగా పిలుస్తారు. స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. మానవ వికాస తత్వశాస్త్రం, మానవత్వ విలువలతో నాయకులను ప్రభావితం చేశారు. ది లైఫ్ డివైన్, ది సింథసిస్ ఆఫ్ యోగా వంటి రచనలు ఎంతో పేరొందాయి. పాండిచ్చేరిలో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. 1950 డిసెంబరు 5న కన్నుమూశారు.

నెల్సన్‌మండేలా (వర్ధంతి)



నల్లజాతి సూరీడుగా ప్రపంచవ్యాప్తంగా పేరొందిన నెల్సన్ మండేలా 1918 జూలై 18న దక్షిణాఫ్రికాలో జన్మించారు. పూర్తిస్థాయి ప్రజాస్వామ్యంలో ఎన్నికైన మొట్టమొదటి నాయకుడు 1994 నుంచి 1999వరకు అధ్యక్షుడిగా కొనసాగారు. అంతకుముందు జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. నోబెల్ శాంతి పురస్కారంతోపాటు ఇండియా నుంచి అత్యున్నతమైన భారతరత్న, ప్రపంచవ్యాప్తంగా 250కుపైగా గౌరవాలు అందుకున్నారు. దక్షిణాఫ్రికాలో ది ఫాదర్ ఆఫ్ ది నేషన్‌గాను, ది ఫౌండింగ్ ఫాదర్ ఆఫ్ డెమోక్రసీగాను గుర్తింపు పొందారు. 2013 డిసెంబరు 5న కన్నుమూశారు.

జయలలిత (వర్ధంతి)



తమిళనాడు రాష్ట్రానికి ఆరుసార్లు ముఖ్యమంత్రిగా కొనసాగిన జయలలిత 1948 ఫిబ్రవరి 24న కర్ణాటక రాష్ట్రం మైసూరు ప్రాంతంలో జన్మించారు. ప్రజారంజక పాలనతో అమ్మగా, పురచ్చి తలైవిగా పిలవబడ్డారు. 1991 నుంచి 2016 వరకు ఆరు సార్లు సీఎంగా ఉన్నారు. సినీనటి, ఏఐఏడీఎంకే పార్టీలో పలు కీలక హోదాలలో కొనసాగారు. రాజకీయాల్లోకి రాకముందు తమిళ చిత్రసీమలో మకుటంలేని మహారాణిగా ఏలారు. తమిళ, తెలుగు, కన్నడలో 140కుపైగా సినిమాలలో నటించారు. 2016 డిసెంబరు 5న కన్నుమూశారు. దేశంలో సీఎంగా కొనసాగుతూ తుదిశ్వాస వీడిన తొలి మహిళా సీఎం ఆమెయే కావడం గమనార్హం.

గులాం అలి (పుట్టినరోజు)



పాకిస్థానీ గజల్ గాయకుడు ఉస్తాద్ గులాం అలి 1940 డిసెంబరు 5న లాహోర్‌లో జన్మించారు. పాటియాలా ఘరానా ఆలాపనలో పేరొందారు. హిందూస్థానీ క్లాజికల్ శైలిలో గజల్స్ ఆలపించేవారు. పాకిస్థాన్, ఇండియా, నేపాల్ బంగ్లాదేశ్ ఇలా దక్షిణ ఆసియా, యూకే, మధ్యప్రాచ్య వ్యాప్తంగా పేరొందారు. బాలీవుడ్ సినిమాలలో ఆయన గజల్స్ ఎంతో పేరొందాయి. బడేగులాం అలి ఖాన్‌కు ప్రముఖ శిష్యుడైన ఆయన ప్రైడ్ ఆఫ్ పర్ఫార్మన్స్ అవార్డు, ఇతర అవార్డులు పొందారు.

శిఖర్ ధావన్ (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ శిఖర్ ధావన్ 1985 డిసెంబరు 5న ఢిల్లీలో జన్మించారు. ఇంటర్నేషనల్ క్రికెటర్‌గా రాణించారు. ఢిల్లీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోనూ, ఐపీఎల్‌లో ఢిల్లీ కేపిటల్స్ తరపున ఆడారు. వన్డేలలోనూ, 20-ట్వంటీ మ్యాచ్‌లలోనూ సత్తా చాటుకున్నారు. 2019నాటికి 24 ఇంటర్నేషనల్ సెంచరీలు చేశారు. అర్జున అవార్డుతో పాటు పలు అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. 2022లో 200వ మ్యాచ్ ఆడి 6వేల పరుగులు పూర్తి చేయడంతో విరాట్‌కోహ్లి తర్వాత ఈ మైలురాయిని అందుకున్న రెండో క్రికెటర్‌గా నిలిచారు.

వస్త్ర ప్రదర్శనను సద్వినియోగం చేసుకోండి



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సీఎస్‌బీ సంయుక్త కార్యదర్శి నరేష్‌బాబు

● కేంద్ర పట్టుమండలి సంయుక్త కార్యదర్శి నరేష్ బాబు

బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల నుంచి పట్టు చీరల, వస్త్రాల ప్రదర్శనలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రపట్టు మండలి జాయింట్ సెక్రటరీ నరేష్ బాబు అన్నారు. చిత్రకళాపరిషత్‌లో ఏర్పాటు చేసిన సిల్క్‌మార్క్ ఎక్స్‌పోను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంగా నరేష్‌బాబు మాట్లాడుతూ కేంద్రపట్టుమండలి ద్వారా ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. పట్టువస్త్రాలకు ఎన్నటికీ ఆదరణ ఉందన్నారు.పండుగలు, శుభకార్యాల వేళ పట్టు వస్త్రాలకే ప్రాధాన్యత ఇచ్చే సంప్రదాయం మన సంస్కృతిలో ఉందన్నారు. పట్టుకు సంబంధించి అన్ని రాష్ట్రాల బ్రాండ్‌లు ఉంటాయన్నారు. వందశాతం శుద్ధమైన పట్టుతో తయారు చేసిన వస్త్రాలు మాత్రమే ప్రదర్శనలలో ఏర్పాటు చేశామన్నారు. సిల్క్‌మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తోందన్నారు. బెంగళూరులో ఆరు రోజులపాటు ప్రదర్శనలు ఉంటాయన్నారు. బెంగళూరు ప్రజలు అరుదైన పట్టువస్త్రాల అనుభవాన్ని పొందవచ్చన్నారు. 43 స్టాల్‌లు ఉన్నాయన్నారు. దక్షిణాదిన మైసూరు, కంచి, ధర్మవరం, పోచంపల్లి వంటి బ్రాండ్‌లే కాకుండా గుజరాత్, మహారాష్ట్ర సహా వివిధ రాష్ట్రాలలో పేరొందిన నాణ్యమైన వస్త్రాలు పొందవచ్చు అన్నారు. సిల్క్‌మార్క్ సంస్థ ఉపాధ్యక్షులు పి శివకుమార్‌తో పాటు పలువురు కేంద్రపట్టుమండలి ముఖ్యులు భాగస్వామ్యులయ్యారు.

కళాశాలలో హిజాబ్-శాలువా వివాదం

బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): హావేరి జిల్లా హానగల్ తాలూకా అక్కిఆలూరు పట్టణ సీజె బెల్లద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిజాబ్-కాషాయ శాలువాల వివాదం బహిరంగమైంది. ఉడుపి జిల్లాలో రెండేళ్ళకిందట చోటుచేసుకున్న వివాదం అంతర్జాతీయ స్థాయిలో చర్చకు కారణమైన విషయం తెలిసిందే. కాగా ఇటీవల కొన్నిరోజులుగా డిగ్రీ కళాశాలలో కొందరు విద్యార్థినులు హిజాబ్‌తోనే తరగతులకు వస్తున్నారనే కారణంతో మరికొందరు కాషాయం శాలువాలను ధరించి తరగతులకు వచ్చారు. దీంతో గురువారం పెద్దఎత్తున విద్యార్థులు శాలువాలను ధరించారు. ఇదే సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలకు చాలాకాలంగా విద్యార్థినులు కొందరు హిజాబ్‌లతో వస్తున్నా కళాశాల యాజమాన్యం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.



కాషాయం శాలువాలతో వచ్చిన విద్యార్థులు

కనీస చర్యలు తీసుకోలేదని కళాశాల అధికారుల తీరుకు నిరసనగానే కాషాయం శాలువాలతో వచ్చామన్నారు. కళాశాల ప్రాంగణానికే పరిమితం కాకుండా తరగతి గదులకు రావడంతో అధ్యాపకులు ఏం మాట్లాడలేకపోయారు. వివాదం తీవ్రరూపం దాల్చవచ్చునని భావించిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు అత్యవసర సమావేశం జరిపారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులను కళాశాలకు రప్పించారు. ప్రభుత్వం సూచించిన విధంగా కేవలం యూనీఫాం దుస్తులతో మాత్రమే తరగతులకు రావాలని విద్యార్థులకు సూచించారు.

ఎత్తిపోతలకు విద్యుత్ వాడకం తగ్గించాలి: బీకే

బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ వాడకం విధానంలో మార్పులతో పాటు తగ్గించే ప్రక్రియ కొనసాగించడం ద్వారా దీర్ఘకాలంలో ఆర్థిక భారంపై ప్రభావం చూపనుందని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ ముఖ్యకార్యదర్శి బీకే పవిత్ర అన్నారు.. గురువారం ఎత్తిపోతల పథకాలు, ప్రపంచ బ్యాంకు సహకారం అనే అంశంపై సెక్రటేరియట్ క్లబ్‌లో నిపుణుల చర్చాగోష్టి జరిగింది. రాష్ట్రంలో పలు ప్రాంతాలలో ఎత్తిపోతల పథకాలు అమలులో ఉన్నాయని మరికొన్ని ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిపారు. అందులో వృషభావతి వ్యాలీ చెరువు ప్రాజెక్టు కూడా ఉందన్నారు. ప్రాజెక్టు అమలు విషయంలో నీటిపారుదల శాఖకు నిరంతరంగా భారమయ్యే విద్యుత్ వాడకంపైనా ఆలోచిస్తున్నామన్నారు. ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి, విద్యుత్ నిపుణులు ఆల్బర్ట్ విలియం మాట్లాడుతూ విద్యుత్ నిర్వహణ, విద్యుత్ మూలభూతం, యంత్రోపకరణాల నియంత్రణలను ప్రాథమిక దశనుంచే ప్రణాళికాబద్ధంగా అంచనా వేయాలన్నారు. పలువురు నీటిపారుదల విభాగం ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

మహిళా కార్మికులు ధైర్యంగా పనిచేయాలి: కమిషనర్

రాయచూరు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): గని కంపెనీలో పని చేసే మహిళా కార్మికులు భయాన్ని వీడి తమ సమస్యలను నిర్భయంగా చెప్పుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నాగలక్ష్మి చౌదరి అన్నారు. గని కంపెనీలో మహిళలు భయం గుప్పిట్లో ఉన్నట్లు కనిపిస్తుందటదామె వ్యాఖ్యానించారు. గురువారం గని కంపెనీ సమావేశ మందిరంలో మహిళా కార్మికులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంపెనీ పరిధిలో మహిళా సంఘం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భయాన్ని వీడి పని చేసినప్పుడే హక్కుల పరిరక్షణ సాధ్యమని ఆ దిశగా మహిళలు మరింత చైతన్యవంతం కావాలని సూచించారు.



కార్మికులతో మాట్లాడుతున్న కమిషన్ చైర్ పర్సన్ నాగలక్ష్మి చౌదరి

ప్రజలకు చుక్కలు చూపుతున్న కాంగ్రెస్: ఎమ్మెల్యే

రాయచూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అధికారం కోసం ఎన్నికల సందర్భంగా అడ్డమైన హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చాక వాటన్నింటిని గాలికొదిలి ప్రజలకు రిక్తహస్తం చూపారని సిటీ ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటిల్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు నిరాశ మిగిలిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పాలన వైఫల్యాలను నిరశిస్తు బీజేపీ శ్రేణులు గురువారం నగరంలోని టిప్పుసుల్తాన్ గార్డెన్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సిటీ ఎమ్మెల్యే గతంలో బీజేపీ ప్రభుత్వం కేంద్రం రైతులకిస్తున్న కిసాన్ సమ్మాన్ నిధులు రూ.6వేలకు అదనంగా రూ. మరో 4 వేలు కలిపి ఇచ్చేదని గుర్తు చేశారు. వాటన్నింటిని ఎత్తేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతుల గోడు గురించి పట్టించుకోన పాపాన పోవడం లేదన్నారు. 50 టీఎంసీల నీరు తుంగభద్ర నదిలో ఉన్నా రైతులకు రెండవ పంటకు నీరిచ్చే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్.శంక్రప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో మాటలు తప్పా ప్రజలకు చేతలు దక్కడం లేదన్నారు. హామీలు నిలుపుకోవడంలో పాలకులు పూర్తిగా విఫలమైయ్యారని కేవలం మాటలతోనే కాలం వెళ్లదిస్తున్నారన్నారు. ఈ ప్రాంత రైతులకు జీవనాడిగా ఉన్న తుంగభద్ర ప్రాజెక్టు గేట్‌లను అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకులు ఆరోపించారు. గేట్‌ల నిర్మాణం కోసం టెండర్ దక్కించుకున్న కంపెనీకి బిల్లులు ఇవ్వకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయని ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని బీజేపీ నాయకులు ఆరోపించారు.



టిప్పుసుల్తాన్ గార్డెన్‌లో రైతుల ఆందోళనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్

టెట్‌ను ప్రశాంతంగా నిర్వహించాలి: ఏడీసీ

హొస్పేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఈ నెల 7తేదీన జరిగే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ఎటువంటి లోపాల్లేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు జిల్లా కలెక్టర్ బాలకృష్ణప్ప అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు పరీక్ష కేంద్రాల్లో భద్రత, సౌకర్యాలు, పర్యవేక్షణ వ్యవస్థలు పూర్తిగా సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. రెండు సెషన్లలో మొత్తం 8,698 మంది అభ్యర్థులు ఉంటారని మొదటి సెషన్‌లో జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో 2, 128 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. రెండో సెషన్‌లో 19 పరీక్ష కేంద్రాల్లో 6,570 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో విద్యాశాఖ డిప్యూటీ డైరక్టర్ వెంకటేష్ రామచంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీసీ బాలకృష్ణప్ప

హేయ్ రోజీ..!

బళ్లారి గాంధీనగర్, డిసెబరు 4(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదీ తీర పరీవాహక ప్రాంతాలకు యేటా వివిధ రకాల విదేశీ పక్షులు వలస పక్షులు వస్తుంటాయి. కొన్నినెలల పాటు ఇదే ప్రాంతంలో విహరించి తర్వాత వెళ్లిపోతుంటాయి. శీతాకాలంలో "రోజీ స్టార్లింగ్ " రకానికి చెందిన పక్షులు ఏటా రావడం ఆనవాయితీ. అలాగే ఈ ఏడు కూడా పక్షుల గుంపు ఇక్కడికి చేరుకుంది. విజయనగర జిల్లా పరిధిలోని హగరిబొమ్మనహళ్ళి పట్టణ శివారు చింత్రపల్లి సరస్సులో "రోజీ స్టార్లింగ్" పక్షులు సందడి చేస్తున్నాయి. గుంపులుగా వస్తున్న రంగు రంగుల పక్షులు కిలకిల ధ్వనులతో ఈ ప్రాంతం సందడిగా మారింది. హగరిబొమ్మనహళ్ళి తాలూకా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రసిద్ధ అంకసముద్రం పక్షులు అభయారాన్యం సమీపంలోని 25 ఎకరాల విస్తీర్ణంలోని చిన్న చింతరపల్లి సర్సుకు వేలాది పక్షులు వచ్చి సేద దీరుతున్నాయి. హరపనహళ్ళిలో ప్రాంతానికి చెందిన అప్పటి సోమశేఖర్ నాయక ఈ సరస్సును నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. దేశం నలుమూలలు, విదేశాల నుంచి పక్షులు ఆహారం కోసం ఇక్కడికి వస్తుంటాయి. ఈ సంవత్సరం రోజీ స్టార్లింగ్స్ ప్రధానంగా యూరఫ్ నుంచి వచ్చినట్లు స్థానిక శాస్త్రవేత్తలు అభిప్రాయ పడుతున్నారు. సరస్సు ఒడ్డున ఉన్న చెట్లపై వేలాది పక్షులు వాలినపుడు అది మల్లెమొగ్గల దండులా కనిపిస్తున్న దృశ్యాలను చూసి స్థానికులు మంత్రముగ్ధులు అవుతున్నారు. అవి పూర్తి స్థాయిలో ఎగురుతుండగా, అవి ఆకాశంలో వల ఎగురుతున్నట్లుగా కనిపిస్తున్న దృశ్యం వర్ణనాతీతం. పక్షదామగా పిలువబడుతున్న తుంగభద్ర జలాశయం బ్యాక్ బాటర్, తాలూకా మాలవి జలాశయం, తిగళనన కెరె, భీమన కెరె, ఓబళాపురం బ్యాక్ వాటర్ జలాల్లో వలస పక్షులకు నివాస యోగ్యంగా మారుతున్నాయి. సరస్సులోకి పక్షులు ప్రవేశిస్తున్నందున సరస్సును రక్షించడంతో పాటు, వేటగాళ్ళ నుంయి పక్షులను రక్షించడం అవసరమని పక్షి ప్రేమికుడు టి.కొట్రేష్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కొమ్మలపై ఆకట్టుకుంటున్న పక్షులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిద్ధలింగ స్వామీజీ

ఆధ్యాత్మికతతోనే సంపూర్ణ జీవనం

● కుందూరు మఠాధిపతి శరత్‌చంద్ర స్వామి

బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సంస్కారం ఉన్నంత మాత్రాన అన్నీ సాధించినట్లు కాదని ఆధ్మాత్మిక ఆచరణ, సత్య శుద్ధతతో కూడిన సంస్కారం ముఖ్యమని మైసూరు కుందూరు మఠాధిపతి డాక్టర్ శరత్‌చంద్ర స్వామీజీ అభిప్రాయపడ్డారు. నగరంలోని బిన్నీమిల్స్ ప్రాంతంలోని గురువణ్ణదేవర మఠంలో బుధవారం రాత్రి కార్తీక దీపోత్సవ కార్యక్రమం జరిగింది. అభ్యాసం బలంతో పూజ చేయడం కేవలం యాంత్రికమే కానీ ప్రయోజనం కాదన్నారు. కర్మాచారణకు బదులుగా మనస్ఫూర్తిగా ఆధ్యాతిక భావాలతో చేసే పూజలు చేయాలన్నారు. వచనాల సత్యాలను ఆచరించడం ద్వారా ఉత్తమ జీవితం సాగించాలన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న తుమకూరు సిద్ధగంగా మఠం సిద్ధలింగస్వామీ మాట్లాడుతూ గురువణ్ణదేవర మఠంలో లింగైక్య మల్లికార్జున స్వామీజీ సేవా కార్యక్రమాలను స్మరించారు. గురుపరంపరను కొనసాగిస్తూ 19వ శతాబ్దంలోని నంజుండస్వామి రచనలను సేకరించి వాటిని మళ్ళీ పుస్తకాల రూపంలో తీసుకురావడం సంతోషమన్నారు. గ్రంథాలను ముట్టుకుని చేతులు కడుగుకోవడం కన్నా మనసు పరిశుభ్రంతో గ్రంథాలను చదవి అందులోని సారాంశాన్ని పాటించాలన్నారు. గురువణ్ణదేవర మఠం నంజుండస్వామి మాట్లాడుతూ తమ మఠానికి చెందిన పూర్వ స్వామీజీ రాసిని కృతులను ఏటా ఒక్కో పుస్తకంగా తీసుకువస్తున్నామని భవిష్యత్ తరాలకు నాటి సాధకుల గురించి తెలపాలన్నదే మా ఆశయమన్నారు. పుస్తకావిష్కరణ తర్వాత వచనజ్యోతి బళిగ ముఖ్యులు వీనాకపాణి బృందం వచనసంగీతాన్ని ఆలపించారు. కనకపుర దేగుల మఠాధిపతి చన్నబసవ స్వామీజీ, బీబీఎంపీ మాజీ మేయర్ గంగాంబికా మల్లికార్జున, బీఎస్ పుట్టరాజు, రాజభవన్ ప్రత్యేక కార్యదర్శి ప్రభుశంకర్, డాక్టర్ శంకరలింగయ్య, నాటకరంగ విమర్శకులు డాక్టర్ రుద్రేష్ అదరంగితో పాటు పెద్దసంఖ్యలో భక్తులు భాగస్వామ్యులయ్యారు.

భార్యను చంపి.. భర్త ఆత్మహత్య

బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పక్షవాతానికి గురై వీల్ చెయిర్‌కే పరిమితంగా మారిన భార్యను హతమార్చి ఆపై భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బెంగళూరు దక్షిణ జిల్లా సుబ్రమణ్యపుర పరిధిలోని చిక్కగౌడన పాళ్యలో జరిగింది. బీఎంటీసీ డ్రైవర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన వెంకటేష్ (65). భార్య బేబి (63)లు మృతి చెందినవారు. ఇటీవల బేబీకి పక్షవాతం రావడంతో వీల్‌చెయిర్‌లోనే జీవనం సాగిస్తుండేవారు. దంపతులకు ఇద్దరు పిల్లలు కాగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో దంపతులు గొడవపడేవారని తెలుస్తోంది. మంగళవారం దంపతుల మధ్య గొడవ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వెంకటేష్ ఆగ్రహానికి లోనయ్యారు. దీంతో బట్టలు ఆరేసేందుకు ఉపయోగించే వైర్ బేబీ గొంతుకు బిగించి హత్య చేశారు. ఆతర్వాత అదే వైరుతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని తానూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. బయటకు వెళ్లిన కోడలు ఇంటికి రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సుబ్రమణ్య పుర పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు వారు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కేరళ ఉద్యోగులకు సెలవు ఇవ్వాలి..


బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పాల్గొనేందుకు అనుగుణంగా మూడు రోజుల పాటు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలంటూ డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను ఆ రాష్ట్ర ఉద్యోగులు కోరారు. కేరళ రాష్ట్రంలో ఈనెల 9నుంచి 11వ తేదీ మధ్యన స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. కేరళ పొరుగు రాష్ట్రం కావడంతో పెద్దఎత్తున బెంగళూరుతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరిశ్రమలతో పాటు నిర్మాణరంగ, కాఫీ తోటలలో పనిచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది కేరళవాసులు నివసిస్తున్నారు. వారంతా సొంతూళ్ళకు వెళ్ళి ఓట్లు వేయాల్సి ఉంటుంది. దీంతో ఈనెల 9 నుంచి 11వ తేదీ దాకా మూడురోజుల పాటు జీతంతో కూడిన సెలవు ఇవ్వాలంటూ ఓ సర్క్యులర్‌ను విడుదల చేశారు. ప్రధానంగా విద్యాసంస్థలు, కాంట్రాక్టర్‌లు, వాణిజ్య పరిశ్రమలు, హోటళ్లు, కాంట్రాక్టర్లు, బిల్డర్లతోపాటు ఇతరత్రా సంస్థల్లో పనిచేసే వారంతా కేరళ వాసులకు వెసలుబాటు కల్పించాలని కోరారు. ఇటీవల బీహార్ శాసనసభ ఎన్నికల వేళ కూడా కేపీసీసీ అధ్యక్షుడి హోదాలో డీకే శివకుమార్ బెంగళూరులో బీహార్ వాసులతో ప్రత్యేకంగా సభ జరిపిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో సెలవు ఇవ్వాలని కోరుతూనే వారు బీహార్‌కు వెళ్ళేందుకు తగిన సహకారం కూడా అందించారు. డీసీఎం తీరును కన్నడ సంఘాలు తప్పుపడుతున్నాయి.

జంతువధశాల ఏర్పాటుపై అభ్యంతరం



ఏసీతో సమావేశమైన కేఐఏడీబీ కాలనీ వాసులు

రాయచూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర సమీపం యరమరస్ వద్ద నిర్మించతలపెట్టిన వధశాల పనులను వెంటనే నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. గురువారం సహాయ కమిషనర్ గజానన బాళెను కలిసి సమావేశమైన కేఐఏడీబీ కాలనీతో పాటు స్థానికులు వినతి పత్రం అందజేశారు. కసాయిఖాన నిర్మిస్తున్న ప్రదేశానికి అత్యంత చేరువలో మురార్జి దేసాయి, అబ్దుల్ కలాం వసతి పాఠశాలలు ఉన్నాయని దీంతో పాటు సమీపంలోని దేవాలయాలు, చెరువు ఉండడంతో ఈ ప్రాంతమంతా కసాయి ఖాన వల్ల కలుషితమైయ్యే పరిస్థితి తలెత్తుతుందన్నారు. వెంటనే ఖసాయిఖాన నిర్మాణ పనులను ఆపివేసి వేరే చోటుకు తరలించాలని కోరారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1622.43	1629.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,542	3,173
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,374	5,580
నీటి నిల్వ (టీఎంసీలు)	68.41	92.80

12న పెన్షన్ అదాలత్

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖలో రిటైరైన పెన్షన్ పొందుతున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12వ తేదీన అదాలత్ నిర్వహించనున్నారు. 12వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం 4గంటల వరకు బళ్ళారి విభాగం తపాలా కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బళ్లారి విభాగం తపాలా శాఖ సూపరెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తపాలా శాఖ ఫింఛన్ దారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కేఆర్ఎస్ ఆధ్వర్యంలో జనస్పందన



ఫిర్యాదులు స్వీకరిస్తున్న నాయకులు

బళ్లారి సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు గురువారం కేఆర్ఎస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సీఎస్టీ యూనిట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో కొన్ని ప్రజాపనులు సకాలంలో పూర్తి కాకపోతే ఈకార్యక్రమంలో ప్రజలు మా పార్టీ నాయకులకు తగిన పత్రాలు అందిస్తే మీ పనిని చట్టబద్ధంగా పూర్తి చేస్తామన్నారు. శ్రీనివాసులు, జనార్దన్, తిప్పేరుద్రప్ప, ప్రకాశ్‌రెడ్డి, జాన్, వెంకటేశులు, నాగరాజు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభివృద్ధే లక్ష్యం

● 'సండూరు సమర్పణ' సమావేశంలో మంత్రి సంతోష్ లాడ్ ● ప్రత్యేక గ్రాంట్ కేటాయిస్తాం : ఎంపీ తుకారాం

బళ్లారి సిటీ/తోరణగల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత దోపిడికీ గురవుతున్న వర్గాల అభివృద్ధికి కృషి చేయడమే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని తమ ప్రభుత్వ లక్ష్యమని కార్మిక మంత్రి సంతోష్ లాడ్ అన్నారు. సండూరు తాలూకా పరిపాలన, తాలూకా పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో విఠలాపూర్‌లోని ప్రభుత్వ ప్రీ-యూనివర్శిటీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన 'సండూరు సమర్పణ' సమావేశ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. తన రాజకీయ జీవితం ఇదే విఠలాపూర్ గ్రామం నుంచే ప్రారంభమయ్యిందని, సండూర్ ప్రజలే తనను అసెంబ్లీకి పంపారన్నారు. 2004లో ఈ ప్రాంతంలోని విద్యుత్ స్థంభంపై 40వాట్ల బల్బు కూడా వెలిగేది కాదు. కానీ ఇప్పుడు విఠలాపూర్ గ్రామంలో విద్యుత్ స్టేషన్ ఏర్పాటుచేసి గ్రామాల్లో వెలుగులు నింపామన్నారు. జిల్లాలోనే ఆదర్శ తాలూకాగా మా ర్చామన్నారు. ఇంటింటికీ తాగునీటి సరఫరా చేస్తున్నామన్నారు. ఐదు గ్యారెంటీలతో ఏటా రూ. 60వేల కోట్లు ప్రజలకు అందజేస్తున్నామన్నారు.

ఎంపీ తుకారాం మాట్లాడుతూ.. నంజుడప్పా నివేదిక ప్రకారం అత్యంత వెనుకబడిన తాలూకాగా ఉన్న సండూర్‌ను 2004నుంచి సుమారు రూ.4,700కోట్ల గ్రాంట్ అందజేసి అభివృద్ధి చేశామన్నారు. ఈసందర్భంగా తోలు పరిశ్రమల అభివృద్ది సంస్థ అధ్యక్షుడు ముండరగి నాగరాజు, హామీపథకాల అమలు అధ్యక్షుడు చిదానందప్ప, సండూర్ తాలూకా హామీ పథకం అమలు సంస్థ అధ్యక్షుడు ఎల్.స్వామి, తోరణగల్లు అధ్యక్షుడు అక్షయ్ అశోక్ లాడ్, హొన్నూర్ స్వామి, రమేశ్, మెట్రిక్ గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు వరలక్ష్మి, రుద్రేశ్, రాజాపూర్ గ్రామ సమాఖ్య అధ్యక్షుడు నాగేశ్, రాజేశ్, సండూర్ తాలూకా స్థాయిలో వివిధ శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సంతోష్ లాడ్



ఎంపీ తుకారాం

బల్డోటా ఎంఎస్‌పీఎల్ ప్లాంట్‌లో రాజ్యోత్సవం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెంకటరమణరెడ్డి, దీపక్‌దాస్

బళ్లారి సిటీ, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): సోమాలపురం, సండూరు బోల్డాటా సమూహ ఎంఎస్‌పీఎల్ ప్లాంట్లలో నవంబరు 1వ తేది నుంచి నవంబరు 30 వ తేదీ వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో కన్నడ రాజ్యోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కంపెనీ సిబ్బంది వర్గానికి నాటకం, వ్యాసరచన, రంగోలి,పాటలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా వెంకటరమణరెడ్డి, దీపక్‌దాస్, వ్యవస్థాపకులు వీరేశ్‌కుమార్, రాఘవేంద్ర మంచాలే, ఈరణ్ణ బోస్లే తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ గేమ్స్‌లో లోకేష్‌కు కాంస్య పతకం

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): విజయనగరం శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ విద్యార్థికి కాంస్య పతకం దక్కింది. భారత ప్రభుత్వం క్రీడా మంత్రిత్వ శాఖ, భారతీయ క్రీడా ప్రాధికార, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్, రాజస్థాన్ ప్రభుత్వం క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా జైపూర్‌లో డిసెంబరు 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ నిర్వహించింది. విశ్వవిద్యాలయానికి చెందిన లోకేష్ రాథోడ్(జీబీఆర్ కళాశాల, హూవినహడగలి) డెకాథ్లాన్ విభాగంలో కాంస్య పథకం సాధించి మూడో స్థానంలో నిలిచినట్లు యూనివర్సిటీ ప్రకటిం చింది. లోకేష్ రాథోడ్‌ను విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్, దైహిక విభాగం క్రీడావిభాగం, సిబ్బంది అభినందించారు.





జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ మునిరాజు

ప్రణాళికతో భవిష్యత్తు నిర్మించుకోవాలి

● విద్యార్థులకు వీసీ మునిరాజు సూచన

బళ్లారి సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్తు ను ప్రణాళికతో రూపొందించుకోవాలని, ఉద్యోగులుగా కాకుండా వ్యవస్థాపకులుగా మారాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎం మునిరాజు అన్నారు. బుధవారం విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ, బళ్లారి జిల్లాపారిశ్రామిక కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన ర్యాంప్ పథకం కింద 'ఎగుమతి ప్రమోషన్ ' కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవస్థాపకతను పెంపొందించడానికి, ఆర్థిక వృద్ధిని సాధించడానికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. బళ్లారిలో ఎగుమతి వ్యవస్థాపకుడు కృష్ణ స్టోన్ క్రషర్ మేనేజింగ్ డైరెక్టర్ రమేశ్ గోపాల్ మాట్లాడుతూ బళ్లారి జిల్లాలో రాష్ట్రంలోనే ఉత్తమ అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాపారిశ్రామిక కేంద్రం జాయింట్ డైరెక్టర్ సోమశేఖర్, విశ్వవిద్యాలయ విద్యార్థి సంక్షేమ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ మాణిక్ మానస, మంజునాథ్, సునిల్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎగుమతి ప్రోత్సాహక వర్క్‌షాప్‌లో 100మందికిపైగా విద్యార్థులు, వివిధ డీన్‌లు, విభాధిపతులు, బోధన సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు వాణిజ్య మండలి అభినందనలు



క్రీడాకారులను సత్కరిస్తున్న మండలి అధ్యక్షుడు మంజునాథ్

బళ్లారి సిటీ, డిసెంబరు 4(ఆంధ్ర జ్యోతి): క్రీడలను ప్రోత్సహించడంలో వాణజ్య పరిశ్రమల మండలి ఎల్లప్పుడూ ముందుంటుందని జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు అవ్వారు మంజునాథ్ అన్నారు. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ చాటిన క్రీడాకారులను బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి గురువారం సత్కరించి ప్రోత్సహించింది. ఈసందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ బళ్లారి కళ, క్రీడలు,సాహిత్యం, వివిధరంగాలలో రాష్ట్ర జాతీయ స్థాయిలో ఖ్యాతిని పొందిందన్నారు. విద్యార్థులు కే. హంశికాసాయి, సముద్విత, మనోజ్ఞసాయి సాధించిన విజయాలు అద్భుతమైనవన్నారు. వాణిజ్య పరిశ్రమల మండలి గౌరవ కార్యదర్శి సురేశ్ బాబు మాట్లాడుతూ యువ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జిల్లా ఖ్యాతిని చాటి చెప్పడం హర్షణీయమన్నారు. పరిశ్రమల మండలి కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు వేణుగోపాల్ గుప్తా, మాజీ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, దొడ్డనగౌడ, సొంతగిరిధర్, మర్చెడ్ మల్లికార్జునగౌడ, రామచంద్ర, నాగల్లి రమేశ్, కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసగౌడ తదితరులున్నారు.

హోసూరు జోన్



హోసూరు శానమావు అడవి నుంచి తరలిపోతున్న ఏనుగులు

ఏనుగులను తరిమికొట్టిన అటవీ సిబ్బంది

హోసూరు డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా రైతులను ముప్పుతిప్పలు పెడుతున్న ఏనుగులను అటవీ సిబ్బంది తరిమికొట్టారు. భారీ బాణసంచా పేలుస్తూ అడవిలోకి తరలించారు. కర్ణాటకలోని బన్నేరుఘట్ట ఉద్యానవనం, కావేరి వన్యప్రాణుల అభయారణ్యం నుంచి దాదాపు 200-225 ఏనుగులు అక్టోబరు నెలలో డెంకణీకోట, నొగనూరు, ఊడేదుర్గం, శానమావు, చెట్టిపల్లి, మహారాజగడ ప్రాంతాల్లోకి ప్రవేశించారు. ఈ ఏనుగుల గుంపుల హోసూరు అటవీ ప్రాంతంలోని రిజర్వ్ అడవులకు ఆనుకుని ఉన్న వ్యవసాయ భూముల్లో పంటలను తిని దెబ్బతీస్తున్నాయి. ఇటీవల మనుషులు, పంటలపై దాడి చేసి భారీగా ఆస్తి, ప్రాణ నష్టం కలిగించాయి. ఏనుగులలో దాదాపు 45-50 ఊడేదుర్గం నుంచి శానమావు అటవికి చేరుకున్నాయి. రాత్రిపూట అబయారణ్యం నుంచి బయటకు వెళ్లి నష్టాన్ని కలిగిస్తున్నాయి. అటవీ రక్షకులు మరియు గార్డులు బృందం నిరంతరం పర్యవేక్షిస్తూ రక్షణ చర్యలు తీసుకుంటుండగా ఈ ఏనుగులు సాయంత్రం శానమావు రిజర్వ్ నుంచి వలస వచ్చి వివిధ గ్రామాలు రోడ్లు మరియు రైల్వే ట్రాక్‌లను దాటి రాత్రికి డెంకణీకోట రిజర్వుకు చేరుకున్నాయి. ఈ విధంగా వెళ్లిన ఏనుగులను ధర్మపురి జోనల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రిజర్వ్‌ల ఆదేశాల మేరకు హోసూరు ఫారెస్టు అధికారి పార్థసారది రాయకోట ఫారెస్ట్ అధికారి శక్తివేల్ , డెంకణీకోట ఫారెస్ట్ అధికారి విజయన్ నేతృత్వంలో హోసూరు రాయకోట మరియు డెంకణీకోట ఫారెస్ట్ రిజర్వ్‌లకు చెందిన 50 మందికి పైగా అటవీ సిబ్బంది థర్మల్ డ్రోన్ సహాయంతో ఎటువంటి ప్రమాదం జరగకుండా అడవులోకి తరిమికొట్టారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డీఎంకే ఆధ్వర్యంలో నిరసన



నిరసనలో డీఎంకే కార్యకర్తలు

హోసూరు డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో ఉగ్రవాదం, భద్రతా సమస్య అని గవర్నర్ చేసిన ప్రకటనను ఖండిస్తూ ద్రావిడ కళగ తరపున నిరసన జరిగింది, గురువారం హోసూరులోని రాంనగర్‌లోని అన్నా విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం జరిగింది, జిల్లా అధ్యక్షుడు వనవేందన్ నిరసనకు నాయకత్వం వహించారు. జిల్లా కార్యదర్శి చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.. ఈ నిరసన కార్యక్రమంలో డీఎంకే జిల్లా కౌన్సిల్ అధ్యక్షుడు యువరాజ్, నిర్వాహకులు కన్మణి, సంగీత, సెల్లి, చిన్నరాజ్, సెల్వం, సురేశ్, మురళీధరన్ ఇళవరసన్, పలువురు పాల్గొని నిరసన చేశారు, ముగింపులో ద్రావిడ కళగం మేయర్ రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ నేత జన్మదిన వేడుకలు

హోసూరు డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): హోసూరు బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు నాగరాజు జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఉదయం హోసూరు మరకతాంబ చంద్రచూడేశ్వర ఆలయంలో ఆయన దర్శనం చేసుకుని తన తండ్రి స్మారక చిహ్నాం వద్ద ఆశీర్వాదం పొందారు, హోసూరు గాంధీ విగ్రహం సమీపంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక అన్నదానాలు కార్యక్రమం , అనంతరం ముత్తు మారియమ్మన్ ఆలయంలో ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.కామరాజ్ కాలనీలో ఎంఎన్ ఛారిటీ పౌండేషన్ ఆటో స్టాఫ్‌ను ఆయన ప్రారంభించారు. ఒన్నలవాడిలోని పాఠశాల పిల్లలకు ఆహారాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఎన్ ఛారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు మెటికల్ ప్రవీణ్‌కుమార్, మురుగన్ నరసింహన్ శ్రీనివాసన్, చలపతి వెంకటేశ్‌రెడ్డి, గోపినాథ్, సత్తిగోపాల్, కిరణ్‌కిషోర్, గుణ, మంజునాథ్, లోకేశ్ పాల్గొన్నారు.



అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకుడు నాగరాజు

7న కర్ణాటక ఉపాధ్యాయుల అర్హత పరీక్ష

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన కర్ణాటక ఉపాధ్యాయ అర్హత పరీక్షల నేపథ్యంలో బళ్లారి నగరంలో పరీక్షల నిర్వహణకు సంబంధించి నగరంలో 26 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి.ఉమాదేవి తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆమె కర్ణాటక ఉపాధ్యాయ అర్హత పరీక్ష-2025 మొదటి సెషన్స్‌కు-2339 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, రెండో సెషన్స్‌కు 7000 మంది అభ్యర్థులు చేరి మొత్తం 9,339 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను బెంగళూరులోని కర్నాటక ఎగ్జామినేషన్ అథారిటీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. 7వ తేదీన ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తుండగా రెండో సెషన్స్ మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల మొత్తం 20 పరీక్షాకేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఒక గంటల ముందు చేరుకోవాలని తెలిపారు. పరీక్ష ప్రవేశ పత్రం తప్పకుండా తీసుకురావాల్సి ఉంటుందని, పరీక్షల మార్గదర్శకాల ప్రకారం జిల్లాధికారి ఆదేశాల మేరకు శాంతి యుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఫోన్, బ్లూటూత్, డివైస్, పేజర్, వైర్‌లెస్, క్యాలుకులేటర్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులలతో పాటు వైట్‌ఫ్లూయిడ్, బ్లేడ్, ఇంకు ఎరేజర్ తదితర వాటిని పూర్తిగా నిషేదిస్తున్నట్లుతెలిపారు. వికలాంగల ప్రమాణ పత్రం ఆధారంగా అలాంటి వారికి పరీక్షలు రాసేందుకు ఒక గంటకు ఇరవై నిపుషాలు చొప్పున మొత్తం 50 నిముషాల అధికంగా కాలావధిని ఇస్తున్నట్లు, ఆన్‌లైన్‌లో అప్లికేషన్ వేసే సమయంలో వికలాంగులు పరీక్ష రాసేందుకు సహాకులను కావాలని అడిగిన వారు పరీక్ష ప్రారంభానికి ఒక రోజు ముందు పరీక్ష కేంద్రం సూపరింన్‌డెంట్‌ను కలిసి వివరాలు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. నగరంలో నిర్వహించే 20 పరీక్షా కేంద్రాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

రాజ్యాంగంతోనే బలమైన ప్రజాస్వామ్యం: న్యాయాధికారి

బళ్లారి సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్య బలంగా ఉందంటే రాజ్యాంగమే కారణమని, ఇదే దేశానికి బలమైన పునాది అని న్యాయాధికారి కేజీ శాంతి అన్నారు. వీరశైవ విద్యావర్ధక సంస్థ, జిల్లాన్యాయ వ్యవస్థ, జిల్లా న్యాయసేవల ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని వుంకి సన్నరుద్రప్ప లా కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగం జనవరి 26 1950 న అమల్లోకి వచ్చిందని, భారత రాజ్యాంగం నవంబర్ 26 1949 న ఆమోదించబడిందన్నారు. దత్తత తీసుకున్న రోజును గుర్తుచేసుకునేందుకు రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటామని ఆయన అన్నారు. 2015లో భారత ప్రభుత్వం నవంబరు 26ని రాజ్యాంగ దినోత్సవంగా ,న్యాయదినోత్సవంగా జరుపుకోవాలని ఆదేశించింది. అంబేద్కర్‌కు నివాళి అర్పించేందుకు రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. మన రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత పత్రం. చట్టాలు చట్టబద్ధంగా పనిచేయడానికి రాజ్యాంగం మార్గనిర్దేశం చేస్తుందని ఆయన అన్నారు. ప్రాథమిక హక్కులు, విధులను మరచిపోకూడదన్నారు. ఈసందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి ,సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్‌హొసమనె, వుంకి సన్నరుద్రప్ప లా కళాశాల అధ్యక్షుడు నరేంద్రబాబు, సభ్యులు చంద్రశేఖర్, ఉడేద ప్రభుదేవా, కళాశాల పిన్సిపాల్ రజని కుమారి, కళాశాల పరిపాలనా సిబ్బంది, బోధన, బేధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న న్యాయాధికారి కేజీ శాంతి

వైభవంగా దత్త జయంతి



శంకరమఠంలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



పేటె ఆంజనేయ స్వామి రథోత్సవంలో భక్తులు

గంగావతి రూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని శ్రీ శంకరమఠం శారద మందిరంలో గురువారం త్రిమూర్తి అవతారాల దత్తాత్రేయ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయ పాదుకాలకు అభిషేకం, అష్టోత్తరపారాయణం, తదితర పూజలను ప్రధాన అర్చకులు కుమార్ భట్ నిర్వహించారు. శంకర మఠం ధర్మదర్శి నారాయణరావు వైద్య ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శ్రీ మఠం నిర్మాణానికి అనేక దశాబ్దాలుగా శ్రీ శకంరాచార్య సేవా ట్రస్ వివిధ మతపరమైన ఆరాధన కార్యక్రమాలను నిర్వహిచడం ద్వారా మతపరమైన అవగాహన సామాజిక సంస్థపై దృష్టి సారించిందని నారాయణరావువైద్యం అన్నారు. అనంతరం దత్తాత్రేయ పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ్, కె.ఆర్ బాలకృష్ణ దేశాయ్, శేషగిరి గడద్, భీమశంకర్ నాగేష్, కాశీనాథ్ భట్ జోషి తదితరులు పాల్గొన్నారు.

పేటె ఆంజనేయస్వామి రథోత్సవం

సిరుగుప్ప, (ఆంధ్రజ్యోతి): పేటె ఆంజనేయస్వామి రథోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్యామాచార్య ఆధ్వర్యంలో పట్టణంలో ఊరేగింపు కొనసాగింది. ఆలయం నుంచి జైన మందిరం వరకు భక్తులు రథోత్సవాన్ని లాగారు. పూలు, పండ్లు విసిరి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. వేలాదిమంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ పరశురాం ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. స్వాముల మూలవిరాట్‌కు పుష్పాలంకార సేవలు చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కంప్లి(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యనారాయణపేటలో వుండే వెంకటేశ్వరస్వామి ఆలయంలో 42వ సంవత్సరం లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పరమహంస నారాయణ విద్యాభారతుల స్వాములు పాల్గొని కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం రథోత్సవం వైభవంగా ఊరేగింపు జరిపారు. ప్రత్యేక లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరుపుకుంటామని విద్యాభారతి స్వామి తెలిపారు. మార్గశిర మాసం పౌర్ణమి సందర్భంగా గురువారం దత్త జయంతి సందర్భంగా షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.



అలంకరణలో దత్తాత్రేయుడు

లారీ యజమానుల సంఘం ఏర్పాటు



నూతనంగా ఏర్పడిన పది చక్రాల లారీ యజమానుల కార్యవర్గం

బళ్లారి సిటీ/రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా ఇసుక రవాణా పది చక్రాల లారీ యజమానుల సంఘం కార్యాలయంలో గురువారం నగరంలోని దేవినగర్‌లో లాంఛనంగా ప్రారంభించడింది. సంఘం నూతన జిల్లాధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ నగరలో ఇసుక రవాణా ట్రక్కుల రాకపోకలను పోలీసులు సహా ప్రజలు అడ్డుకుంటున్నారని, దీని వల్ల నగరంలోకి బయటకు ఇసుక రవాణాకు ఇబ్బందిగా ఉందన్నారు. అప్పులు చేసి కొన్న ట్రక్కుల ఈఎంఐ కూడా చెల్లించలేకపోతున్నామని, దీనిని గ్రహించి అధికారులు న్యాయం చేయాలన్నారు. ఈసందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు సుదాకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి రమేశ్, కోశాధికారిగా చంద్రశేఖర్, పరశురాం, లింగమూర్తి, శ్రీరాములు, న్యాయ సలహాదారుగా న్యాయవాది వేణుగోపాల్. బళ్లారి ఇసుక రవాణా పది చక్రాల లారీ యజమానుల సంఘం ఆఫీసు బేరర్లు,సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భూ న్యాయమండలి పదాధికారుల నియామకం



భూ న్యాయ మండలికి నూతనంగా ఎన్నికైన సభ్యులు

కంప్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కంప్లి తాలుకా భూ న్యాయ మండలి పదాధికారుల నియామకం గురువారం జరిగింది. అందులో మోహన్, నవీన్, గురుమూర్తి, షేక్షావలీ ఈ నలుగురితోపాటు అధ్యక్షుడిగా జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కార్యదర్శిగా తహసీల్దార్ నియామయ్యారని అధికారులు తెలిపారు. అనంతరం నియామకమైన భూ న్యాయ మండలి నూతన సభ్యులు ఎమ్మెల్యే గణేష్‌ను అభినందించి సన్మానించారు. అవకాశాన్ని సద్వినియోగపరచు కోవాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

బ్యాంకు మేనేజర్లకు అవగాహన

బళ్లారిరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బళ్లారి రూరల్ తాలుకాలోని మోకా పరమదేవనహళ్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రుద్రప్ప, ఎస్ఐ కాళింగ నేతృత్వంలో పీడీహళ్లి, మోకా ప్రాంతాల్లో వుండే బ్యాంకు మేనేజర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా సీఐ రుద్రప్ప మాట్లాడుతూ బ్యాంకులో సీసీ కెమెరా తో పాటు సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని, అదేవిధంగా బ్యాంకు లోపల, బ్యాంకు బయట సీసీ కెమెరా పోటీలు ఏర్పాటు చేయాలని మేనేజర్లకు పలు సూచనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కాళింగ, ఎస్‌బి కానిస్టేబుల్ బసవన్నగౌడ, బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకర్లతో సమావేశమైన సీఐ రుద్రప్ప, ఎస్ఐ కాళింగ